# కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజా ప్రతిఘటన తప్పదు

- ఎంపీ అర్వింద్ జిల్లాకు పట్టిన దరిద్రం
- అమ్దాపూర్‌లో 'నమస్తే నవనథపురం'లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, జూన్19: ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అమ్దాపూర్ గ్రామంలో 'నమస్తే నవనథపురం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి తన అభిమతమని, ప్రజా సంక్షేమం తన ఏకైక ధ్యేయమని అన్నారు. అమ్దాపూర్ గ్రామ పంచాయతీకి ఏటా రూ.16లక్షల 12వేల చొప్పున అభివృద్ధి నిధులొస్తున్నాయని, గ్రామంలో 325 మందికి రూ.2016 చొప్పున ప్రతినెలా రూ.6లక్షల 80వేల పింఛన్లు అందుతున్నాయని అన్నారు. దివ్యాంగుల పింఛను రూ.3016 నుంచి రూ.4016కి పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అమ్దాపూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న 55మందికి సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా రూ. 38లక్షల 32వేల ఆర్థిక సాయం అందించామన్నారు. వివిధ కారణాలతో గ్రామంలో ఎనిమిది మంది రైతులు మృతి చెందగా బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ.40లక్షల పరిహారం అందించామన్నారు. అమ్దాపూర్ గ్రామంలో సొంత స్థలం ఉన్న వారికి రూ.3లక్షల సాయం గృహలక్ష్మి పథకం ద్వారా అందించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇంటింటికీ ఒకటి నుంచి మూడు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్‌కు తప్ప మరే పార్టీకి ఆర్మూర్‌లో చోటు లేదన్నారు. ఎంపీ అర్వింద్‌ను ఈ ఎన్నికల్లో డిపాజిట్ రాకుండా ఓడిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రజాద్రోహులన్నారు. అధికారంలో ఉన్నప్పుడు నిద్రపోయిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అధికారం కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అంటేనే బడుగు, రైతు సంక్షేమమన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, కేసీఆర్ నాయకత్వమే దేశప్రజలకు భరోసా అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పస్క నర్సయ్య, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, ఎంపీటీసీలు, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి


చెక్కు అందజేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు నునుగోడు రమేశ్

## సీఎంఆర్‌ఎఫ్‌కు రిటైర్డ్ ఉపాధ్యాయుడి విరాళం

ముప్కాల్, జూన్ 19: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నునుగోడు రమేశ్ తన జన్మ దినాన్ని పురస్కరించుకొని సీఎం ఆర్‌ఎఫ్‌కు రూ.25 వేల విరాళం అందించారు. ఈ చెక్కును సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో తన పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సామ వెంకట్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో భరత్ చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

వేల్పూర్, జూన్ 19: చేయూత ఫౌండేషన్ వేల్పూర్ ఆధ్వర్యంలో వేల్పూర్ గ్రామానికి చెందిన దామ లక్ష్మి కొన్ని రోజుల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నది. ప్రతిరోజు డయాలసిస్ చేయడానికి చాలా ఖర్చు కావడంతో చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు 20వేల ఆర్థిక సాయాన్నిఅందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు హితీశ్, సభ్యులు కార్తీక్, సురేశ్, మహిపాల్, మల్లికార్జున్, దినేశ్ పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

ఆర్మూర్, జూన్19: తన భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడం లేదని మనస్థాపంలో పట్టణంలోని ఔటిగల్లీకి చెందిన గంగారపు మనోజ్‌కుమార్(30) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్మూర్ ఎస్సై రాములు కథనం ప్రకారం.... మనోజ్ కుమార్‌కు తన భార్యతో గొడవలు జరిగాయి. ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదని మనస్థాపం చెందిన మనోజ్‌కుమార్ ఆర్మూర్ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కూతురు ఉంది.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

మాక్లూర్, జూన్19: ఈనెల 17న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో గాయపడిన మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన సాయన్నోల్ల శ్రీనివాస్ (32) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. గొట్టుముక్కల గ్రామ శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ గాయపడగా చికిత్స నిమిత్తం స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


శ్రీనివాస్(ఫైల్)

# విద్యార్థులకు అక్షరాభ్యాసం


విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

శక్కర్‌నగర్, జూన్ 19: బోధన్ పట్టణంలోని తట్టికోట్ ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులకు సోమవారం అక్షరాభ్యాసం చేయించారు. స్థానిక మారుతీ మందిరం పూజారి ప్రవీణ్ మహరాజ్, ప్రధానోపాధ్యాయురాలు ఇందూర్ లలిత ఆధ్వర్యంలో విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. ఉపాధ్యాయులు రాధిక, గోదావరి, నవిత, సోషల్ వర్కర్ సనాపటేల్ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న వైస్ ఎంపీపీ మోతె భోజకళా చిన్నారెడ్డి

## చెక్కు అందజేత

ఆలూర్, జూన్ 19: ఇటీవల విద్యుదాఘాతంతో మండల కేంద్రానికి చెందిన వంజరి పోతన్న మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు ట్రాన్స్‌కో నుంచి మంజూరైన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును వైస్ ఎంపీపీ మోతె భోజకళా చిన్నారెడ్డి సోమవారం అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుమ్మరి లక్ష్మి, మల్లేశ్ పాల్గొన్నారు.

## యూనిఫాం పంపిణీ

రెంజల్, జూన్ 19: మండల కేంద్రంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు యూనిఫాంను పంపిణీని సర్పంచ్ రమేశ్‌కుమార్ ప్రారంభించారు. మండలంలో 20 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం అందజేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కట్ట శ్రీనివాస్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల సామలింగంగౌడ్, సీహెచ్.సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగోన్నతి పొందిన సీఐకి సన్మానం

రెంజల్(నవీపేట), జూన్19: నవీపేట్ ఎస్సైగా విధులు నిర్వహించి సీఐగా ఉద్యోగోన్నతి పొందిన రాజారెడ్డిని, నిజామాబాద్ రూరల్ సీఐ సతీశ్ కుమార్‌ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, విండో చైర్మన్ న్యాలకంటి అబ్బన్న, నాయకులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నవీపేట్ పట్టణ అధ్యక్షుడు లోకం నర్సయ్య, ఎంపీటీసీ సాయిలు, మాజీ సర్పంచ్ అల్లం రమేశ్, గైని సతీశ్, జియావుద్దీన్ పాల్గొన్నారు.

## బోధన్‌లో ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి సహకరిస్తా

- బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్


క్రీడా భవనాన్ని ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి ప్రారంభిస్తున్న క్లబ్ చైర్మన్, ఆర్డీవో రాజేశ్వర్

బోధన్, జూన్ 19: బోధన్‌లో ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ హామీ ఇచ్చారు. సోమవారం బోధన్ ఆఫీసర్స్ క్లబ్‌లో నూతనంగా నిర్మించిన క్రీడా భవనాన్ని ఆఫీసర్స్ క్లబ్ చైర్మన్, ఆర్డీవో రాజేశ్వర్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్లబ్ నిర్వహణ చాలా బాగుందని, ఈ క్లబ్‌లో మరిన్ని సౌకర్యాల కోసం తనవంతుగా నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఇన్‌డోర్ గేమ్స్ కోసం నిర్మించి, ఏర్పాటు చేసిన వసతులు, నిర్వహణపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కన్వీనర్ లక్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, పార్టీ నాయకుడు కన్వీనర్ బుద్దె రాజేశ్వర్, ఆఫీసర్స్ క్లబ్ కమిటీ సభ్యులు ఉమేశ్ షిండే, కల్యాణ చక్రవరి, కొంద్ర వెంకటి, చందూర్ పోశెట్టి పాల్గొన్నారు.

## విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బాల్కొండ, జూన్ 19: ఉమ్మడి బాల్కొండ మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని విజయవంతం పేర్కొన్నారు.

## నేడు నమస్తే తల్వేద కార్యక్రమం

నందిపేట్, జూన్ 19: మండంలోని తల్వేద గ్రామంలో మంగళవారం 'నమస్తే తల్వేద' కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పాల్గొని గ్రామంలోని వాడవాడలా తిరిగి ప్రజలతో మాట్లాడుతారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులపై అధికారులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## విద్యార్థులకు బహుమతుల పంపిణీ


బహుమతులు అందుకున్న విద్యార్థులు

ముప్కాల్, జూన్ 19 : మండల కేంద్రంలో న్యూ హరిజోన్స్ పాఠశాలలో స్పోర్ట్స్ అండ్ సైన్స్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు సోమవారం ఫ్రెండ్లీ పోలీస్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా బహుమతులు అందజేశాయి. ముప్కాల్ ఏఎస్సై తొగర్ల సురేశ్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ చాకు లింగం విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు విక్రమ్, కనకయ్య, జాపు భూమన్న, పాఠశాల కరెస్పాండెంట్ భూస రత్నాకర్, ప్రిన్సిపాల్ చంద్ర విలాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీడీసీ అధ్యక్షుడిగా మాజీ సైనికుడు

మాక్లూర్, జూన్ 19: మామిడిపల్లి వీడీసీ కమిటీని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాలేవర్ రాజు(మాజీ సైనికుడు), క్యాషియర్‌గా అవుసలి శ్రీకాంత్, సభ్యులుగా సత్యనారాయణ, లడ్డు గంగాధర్, బోర్గాం పెద్దలు తలారి పెద్దలు కలగడ్డ శ్రీనివాస్, ప్రకాశ్ భూషణ్, నవీన్ గౌడ్, మెడికల్ శ్రీనివాస్, మోహన్, రాజేశ్వర్, హన్మాండ్లు, రాము, పెండ బాబు, చిన్నారెడ్డి, కూన మోహన్, మల్లయ్య, పాండవుల శ్రీను ఎన్నికయ్యారు.


కలివార్ రాజు